అధినేతకు ఘన స్వాగతం పలకాలి

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

సమావేశంలో మాట్లాడుతున్న సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

బేగంపేట్, జూన్ 10: తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్‌కు ఘన స్వాగతం పలకాలని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ పిలుపునిచ్చారు. మంగళవారం సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని బీఆర్ఎస్ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టుపై ఏర్పాటైన కమిషన్ విచారణకు హాజరయ్యేందుకు కేసీఆర్ బుధవారం ఉదయం బీఆర్‌కే భవన్‌కు వస్తారని వివరించారు. ఉదయం 10 గంటల వరకు నియోజకవర్గ పరిధిలోని పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో బీఆర్‌కే భవన్ వద్దకు చేరుకొని కేసీఆర్‌కు ఘనంగా స్వాగతం పలకాలని కోరారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ యువనేత తలసాని సాయికిరణ్‌యాదవ్, పార్టీ డివిజన్ అధ్యక్షుడు అత్తిలి శ్రీనివాస్‌గౌడ్, కౌలన్ బాల్‌రెడ్డి, గుర్రం పవన్‌కుమార్‌గౌడ్, ఆకుల హరికృష్ణ, హన్మంతరావు, వెంకటేషన్‌రాజు, మాజీ కార్పొరేటర్ అత్తిలి మల్లికార్జున్‌గౌడ్, నాయకులు సురేష్‌గౌడ్, లక్ష్మిపతి, కిషోర్, ఆరీఫ్, జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పెద్ద ఎత్తున తరలిరావాలి

సికింద్రాబాద్: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బుధవారం ఉదయం బీఆర్‌కే భవన్, ట్యాంక్‌బండ్‌లో నిర్వహించే కాళేశ్వరం కమిషన్ ఎదుట హాజరయ్యేందుకు విచ్చేస్తున్నారని సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ కార్యాలయ అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయనకు మద్దతు తెలిపేలా మన నియోజకవర్గ కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు, ఉద్యమకారులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, యువత, విద్యార్థి, కార్మిక విభాగాల నేతలు, అనుబంధ సంఘాల నాయకులు, పోలింగ్ బూత్, బస్తీ కమిటీల సభ్యులు, వివిధ పథకాల లబ్ధిదారులు, కేసీఆర్, కేటీఆర్, పజ్జన్న అభిమానులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తప్పకుండా ఉదయం 9 గంటలకు బీఆర్‌కే భవన్ చేరుకోవాలని కోరారు.

లా ఫలితాల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులు ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని వివిధ లా కోర్సుల పరీక్ష ఫలితాల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. మూడేండ్ల ఎల్ఎల్బీ, మూడేండ్ల ఎల్ఎల్బీ ఆనర్స్, ఐదేండ్ల బీఏ ఎల్ఎల్బీ, ఐదేండ్ల బీబీఏ ఎల్ఎల్బీ, ఐదేండ్ల బీకాం ఎల్ఎల్బీ కోర్సుల మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని, ఫలితాలను తమ వెబ్సైట్లో అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. మార్కుల మెమోలను సంబంధిత కళాశాల నుంచి ఈ నెల 20వ తేదీ తర్వాత పొందవచ్చని పేర్కొన్నారు. రీవాల్యుయేషన్‌కు ఒక్కో పేపర్‌కు రూ.700 చొప్పున చెల్లించి ఈ నెల 20లోగా, రూ.200 అపరాధ రుసుముతో 24వ తేదీ వరకు టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. జవాబు పత్రాల నకలు పొందగోరువారు ఒక్కో పేపర్‌కు రూ. 1000 చొప్పున చెల్లించి వచ్చే నెల 9వ తేదీ వరకు తమ కార్యాలయంలో చెల్లించాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్‌లో చూసుకోవాలని సూచించారు.

విదేశీ భాషల డిప్లొమా కోర్సుల ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని విదేశీ భాషల డిప్లొమా కోర్సుల పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. పీజీ డిప్లొమా ఇన్ జర్మన్, పీజీ డిప్లొమా ఇన్ ఫ్రెంచ్ కోర్సుల పరీక్ష ఫలితాలను విడుదల చేశామన్నారు.

బీఈ కోర్సుల పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని బీఈ కోర్సుల చివరి సెమిస్టర్ పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని విభాగాల బీఈ సీబీసీఎస్, బీఈ నాన్ సీబీసీఎస్, బీఈ ఏఐసీటీఈ కోర్సుల చివరి సెమిస్టర్ మెయిన్, బ్యాక్‌లాగ్, వన్ టైం చాన్స్ పరీక్షలను ఈ నెల 25వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు ప్రకటించారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.in లో చూసుకోవాలని సూచించారు.

మైసిగండి ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

అమ్మవారి ఆలయంలో పూజల్లో పాల్గొన్న సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ తదితరులు

సికింద్రాబాద్, జూన్ 10: మైసిగండి అమ్మవారి ఆలయంలో సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావు గౌడ్ మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బౌద్ధనగర్ డి విజన్ కార్పొరేటర్ కంది శైలజ తో పాటు నాయకులు సుంకు రామచందర్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు డ్రైవింగ్ లైసెన్స్ ఇవ్వాలి



రవాణా శాఖ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న దివ్యాంగ వేదిక నాయకులు

ముషీరాబాద్, జూన్ 10: దివ్యాంగులకు డ్రైవింగ్ లైసెన్స్ ఇవ్వాలని కోరుతూ అఖిల భారత వికలాంగుల వేదిక జాతీయ అధ్యక్షుడు కొల్లి నాగేశ్వరావు ఆధ్వర్యంలోని ప్రతినిధి బృందం రవాణా శాఖ కమిషనర్ సురేంద్రమోహన్ కలిసి వినతి పత్రం సమర్పించారు. రాష్ట్రంలో ఉండే దివ్యాంగులందరికీ డ్రైవింగ్ లైసెన్స్ ఇవ్వాలని, సకలాంగులతో సమానంగా వికలాంగులు వాహనాలు నడిపే విధంగా డ్రైవింగ్ లైసెన్స్ ఇచ్చి, సమాన హక్కు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని అఖిల భారత దివ్యాంగుల హక్కుల వేదిక నాయకులు జంగిల్ శ్రీనివాస్, పంది శ్రీనివాస్, మాధవి విజ్ఞప్తి చేశారు.

దళితుల కోసం కుసుమ ధర్మన్నపోరాటం

సభలో మాట్లాడుతున్న ఆచార్య కొలకలూరి ఇనాక్

ముషీరాబాద్, జూన్ 10: వివక్షత ఎదుర్కొంటున్న దళితుల కోసం, సమాజంలో పలు రుగ్మతలపై అవిశ్రాంతంగా పోరాడిన గొప్ప వ్యక్తి కుసుమ ధర్మన్న అని శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ వైస్ చాన్సలర్ ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. మంగళవారం ఎందరో మహానుభావులు మధుర స్మృతుల్లో భాగంగా తొలి దళిత కవి, వ్యాస కర్త, ఉద్యమకారుడు కుసుమ ధర్మన్న సంస్కరణ సభ చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆచార్య కొలకలూరి ఇనాక్ మాట్లాడుతూ రాజ్యంగ నిర్మాత అంబేద్కర్‌ను తెలుగు వారికి పరిచయం చేసింది కుసుమ ధర్మన్న అని గుర్తుచేశారు. ధర్మన్న గాంధీ అనుచరుడు అయినప్పటికీ దళితుల విషయంలో రాజీలేని పోరాటం చేశాడని అన్నారు. భాగ్యరెడ్డివర్మతో కలిసి హైదరాబాద్ నగరంలో పలు ఉద్యమ సభలు జరిపారని గుర్తు చేసుకున్నారు. ఆయన రచించిన 'మా కొద్దీ నల్ల దొర తనం' నాటి సమాజ పరిస్థితికి దర్పణం అన్నారు. అంటరాని తనం పోయినప్పుడే నిజమైన స్వాతంత్రం అని ధర్మన్న చెప్పేవారని అన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో యువ కళావాహిని అధ్యక్షుడు లంక లక్ష్మినారాయణ, సినీ నటుడు మాణిక్, గాయని గరిమెళ్ల సీత పాల్గొన్నారు.

అమరుడు కృష్ణకాంత్ త్యాగం మరువం

రసూల్‌పురాలో తెలంగాణ అమరవీరుడు కృష్ణకాంత్ విగ్రహం వద్ద ఆయన కుటుంబ సభ్యులతో కలిసి కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గజ్జెల నాగేష్, టీఎన్ శ్రీనివాస్ తదితరులు

బొల్లారం,జూన్ 10: తెలంగాణ రాష్ట్రం కోసం అమరవీరుడు కట్టెల మండి కృష్ణకాంత్ బలిదానం చిరస్మరణీయమని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, రాష్ట్ర బేవరేజస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గజ్జెల నాగేష్, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ టీఎన్ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం కృష్ణకాంత్ 29వ జయంతిని రసూల్‌పురాలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గజ్జెల నాగేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కృష్ణకాంత్ విగ్రహానికి ఆయన కుటుంబ సభ్యులు, టీఎన్ శ్రీనివాస్‌తో కలిసి ఘనంగా నివాళులర్పించి కేక్ కట్ చేశారు. అనంతరం గజ్జెల నాగేష్ మాట్లాడుతూ కృష్ణకాంత్ త్యాగం తెలంగాణ ప్రజలు మరువబోరని, బీఆర్ఎస్ పార్టీ ఆయన కుటుంబానికి అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు దేవులపల్లి శ్రీనివాస్, శ్యామ్‌రెడ్డి, దేవరాజ్, పొన్నాల బాబు, ప్రవీణ్, శివ, కుటుంబ సభ్యులు ధనరాజ్, హేమలత, చంద్రకాంత్, రవికాంత్ తదితరులు పాల్గొన్నారు

సమానత్వ సాధన కోసం ఉద్యమించాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఐద్వా సీనియర్ నాయకురాలు జ్యోతి

చిక్కడపల్లి, జూన్ 10: మహిళలు సమానత్వ సాధన కోసం ఉద్యమించాలి ఐద్వా సీనియర్ నాయకురాలు టి.జ్యోతి అన్నారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర రాజకీయ శిక్షణా తరగతులు మంగళవారం బాగ్లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం నిర్వహించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ సభలో ఐద్వా సీనియర్ నాయకురాలు టి.జ్యోతి ముఖ్యఅతిథిగా హాజరై జిల్లాల్లో ఉండే సమస్యలను అధ్యయనం చేసి వాటి పరిష్కారం కోసం కృషి చేయాల్సిన అవసరం ఉంది అన్నారు. నిత్యం జనంలో ఉండి పనిచేసే ఐద్వా నాయకత్వానికి ఈ రకమైన శిక్షణ చాలా అవసరం అని పేర్కొన్నారు. రాజకీయ క్లాసులో అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర పరిస్థితులపై రాష్ట్ర ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎమ్.అబ్బాస్ వివరించారు. ఈ సమావేశంలో ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎమ్.జ్యోతి, రాష్ట్ర సహాయ కార్యదర్శులు కె.ఎన్.అశాలత, సరళ, పి.ప్రభావతి, ఎన్.రత్నమాల, మహేశ్వరి, ఎమ్.వినోధ, పి.శశికళ, బి.అనూరాధ, వై.వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఫ్రెండ్స్ ఆర్టిస్ట్స్ గ్రూప్ ఆఫ్ హైదరాబాద్ సభ్యుల ఆత్మీయ సమావేశం మంగళవారం బేగంపేటలోని స్వామి రామానందతీర్థ మెమోరియల్ కమిటీ ప్రాంగణంలోని పీవీ నరసింహారావు భవన్లో జరిగింది. సంస్థ సభ్యురాలైన ఎమ్మెల్సీ వాణిదేవితో పాటు మరికొందరు ఆత్మీయ కలయికకు హాజరయ్యారు. చాలా ఏళ్ల తర్వాత కలుసుకున్న వారంతా పాత రోజులను గుర్తుచేసుకుని మురిసిపోయారు.

– బేగంపేట్, జూన్ 10

ఘనంగా తుంగ బాలు జన్మదిన వేడుకలు

కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్వీ నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ విద్యార్థి ఉద్యమకారుడు, బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగ బాలు జన్మదిన వేడుకలను ఓయాలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆర్ట్స్ కళాశాల ఆవరణలో బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో విద్యార్థి నాయకులు కేక్ కట్ చేసి, మొక్కలు నాటి వేడుకలు జరుపుకున్నారు. పలువురు మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో తుంగ బాలు ముందుండి పోరాడారని గుర్తు చేశారు. ఆయన భవిష్యత్తులో ఉన్నత పదవులు అధిష్టించాలని ఆకాంక్షించారు. నిండు నూరేండ్లు ఆయురారోగ్యాలతో జీవించాలని భగవంతుని ప్రార్థిస్తున్నట్లు చెప్పారు.

మిలటరీ వైద్య సేవలు అభినందనీయం

బొల్లారం, జూన్ 10: సైనిక ఆరోగ్య సంరక్షణలో నైపుణ్యం, ఆవిష్కరణల పట్ల సాయుధ దళాల వైద్య సేవలు అభినందనీయమని సర్జన్ వైస్ అడ్మిరల్ వైద్యాధికారి ఆర్తి సరీన్ తెలిపారు. మంగళవారం తిరుమలగిరిలోని మిలిటరీ దవాఖానలో వైద్యపరమైన అడ్వాన్స్‌డ్ పై డైరెక్టర్ జనరల్ ఫోర్సెస్ మెడికల్ సర్వీసెస్ సమీక్ష సమావేశం నిర్వహించారు. సాయిధ దళాల సిబ్బంది, అనుభవజ్ఞులు వారి కుటుంబాలకు ప్రపంచ స్థాయి ఆరోగ్య సంరక్షణ అందించడంలో సేవలను తెలియజేశారు. వైద్యాధికారులు ప్రయోగశాల ప్రివెంటివ్ మెడిసిన్‌లో స్పెషలిటీ సేవల విస్తరణతో పాటు ఇటీవల పురోగతుల గురించి సర్జన్ వైస్ అడ్మిన్ సరీన్‌కు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శాంతి సమయంలో, కార్యాచరణ సంసిద్ధతను సమర్థించడంలో సైనిక ఆసుపత్రి కీలకపాత్రను పోషించిందని ప్రశంసించారు. అభివృద్ధి చెందుతున్న అవసరాలను తీర్చడానికి శిక్షణ సాంకేతిక పరిజ్ఞానం స్వీకరించడం కారుణ్య ఆరోగ్య సంరక్షణ అందించడంలో నిరంతర పెట్టుబడులు పెట్టాలని ఆమె పిలుపునిచ్చారు.

నిజాయితీతో దేశానికి సేవ చేయాలి

బొల్లారం, జూన్ 10: సాయుధ దళాల భద్రత, గౌరవం, సమగ్రతను కాపాడుతూ అచంచలమైన నిజాయితీతో దేశానికి సేవ చేయాలనీ 1 ఈఎంఈ సెంటర్ కమాండెంట్ బ్రిగేడియర్ ప్రశాంత్ బాజ్‌పాయ్ తెలిపారు. మంగళవారం బొల్లారంలోని 1 ఈఎంఈ కేంద్రంలో అగ్ని వీర్ బ్యాచ్ పాసింగ్ అవుట్ పరేడ్ సైనిక అలంకరణ సంప్రదాయ లాంఛనాలతో ఘనంగా నిర్వహించారు. మొత్తం 1024 మంది అగ్నివీరులు తమ ప్రాథమిక అధునాతన, సైనిక శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్నారు. కమాండెంట్ బ్రిగేడియర్ మాట్లాడుతూ సమకాలీన యుద్ధభూమి అవసరాలకు అనుగుణంగా సాంకేతికంగా నైపుణ్యం కలిగిన మిషన్‌కు సిద్ధంగా ఉన్న సైనికులను పెంపొందించడానికి భారత సైన్యం నిరంతరం కృషి చేస్తుందని పేర్కొన్నారు. అనంతరం అసాధారణ ప్రదర్శనకు గుర్తింపుగా అత్యుత్తమ అగ్ని వీరులను కమాండెంట్ పతకాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో 1 ఈఎంఈ మిలిటరీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

సీసీ కెమెరాల ఏర్పాటుతో నేర నియంత్రణ

శ్రీకాంత్‌రెడ్డి, తుకారంగేట్ సీఐ

అడ్డగుట్ట జూన్ 10: బస్తీ, కాలనీల్లో సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా నేరాల నియంత్రణ సాధ్యమవుతుందని తుకారంగేట్ సీఐ శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం తుకారంగేట్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీసీ కెమెరాలను అమర్చడం ద్వారా బస్తీ, కాలనీలలో దొంగతనాలకు, నేరాలకు ఎలాంటి ఆస్కారం ఉండదని పేర్కొన్నారు. ఒకవేళ జరిగినా, నిందితులను పట్టుకునేందుకు సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని ఆయన తెలిపారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, కాలనీల ప్రతినిధులు, దాతలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల కలిగే ఉపయోగాలపై ప్రజలకు తరచుగా అవగాహన కల్పిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

వృద్ధుడు అదృశ్యం

భిక్షపతి (ఫైల్)

అడ్డగుట్ట, జూన్ 10: ఆసుపత్రికి చికిత్స నిమిత్తం వచ్చిన ఓ వృద్ధుడు అదృశ్యమైన సంఘటన చిలకలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం మహబూబ్‌నగర్ పాలకుర్తి ప్రాంతానికి చెందిన భిక్షపతి (63) గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. దీంతో ఈనెల 5వ తేదీన తన కూతురు దుర్గతో కలిసి గాంధీ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం వచ్చాడు. ఆస్పత్రి ప్రాంగణంలో తన తండ్రిని వేచి ఉండమని చెప్పి అడ్మిషన్ వివరాలు తెలుసుకొని వచ్చేసరికి ఆయన అక్కడ లేకపోవడంతో దుర్గ ఆందోళనకు గురైంది. ఎంత వెతికినా తన తండ్రి కనిపించకపోవడంతో బంధువుల, స్నేహితుల ఇండ్లల్లో వాకబు చేసింది. అయినా కూడా ఫలితం లేకపోవడంతో చేసేదేమీ లేక చిలకలగూడ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

చిక్కడపల్లి: ముషీరాబాద్ ఫిష్ మర్చంట్ల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని ముషీరాబాద్ ఫిష్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు జిల్లా శ్రీకాంత్ అన్నారు. ముషీరాబాద్ ఫిష్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా నియమితులైన శ్రీకాంత్‌ను చిక్కడపల్లి గంగపుత్ర సంఘం అధ్యక్షుడు గుండు జగదీష్‌బాబు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సీహెచ్ జగదీష్. ఎన్.శ్రీహరి. నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ స్థలం వేలాన్ని విరమించుకోవాలి

మాజీ కార్పొరేటర్ ఎన్.శేషుకుమారితో సమావేశమైన ఎస్సార్‌నగర్ నివాసితుల సంక్షేమ సంఘం ప్రతినిధులు

అమీర్‌పేట్, జూన్ 10: ప్రజా వ్యతిరేక విధానాలతో రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర వ్యతిరేకతను మూటగట్టుకుందని మాజీ కార్పొరేటర్ ఎన్.శేషుకుమారి అన్నారు. హౌసింగ్ బోర్డుకు చెందిన ఎస్ఆర్‌నగర్ కమ్యూనిటీ హాల్ స్థలాన్ని ప్రభుత్వం ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టేందుకు బహిరంగ వేలానికి సిద్ధమవ్వడం సరికాదన్నారు. వెంటనే దీనిని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మొండిగా ముందుకు వెళితే.. కాలనీకి చెందిన దాదాపు 5వేల మంది ఇంటి యజమానులతో పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని స్పష్టం చేశారు. వేలం ప్రకటనతో ఆందోళన చెందిన నివాసితుల సంక్షేమ సంఘాల ప్రతినిధులు మంగళవారం మాజీ కార్పొరేటర్ శేషుకుమారిని కలిసి సమస్యను వివరించారు. ఈ సందర్భంగా శేషుకుమారి మట్లాడుతూ కమ్యూనిటీ హాల్‌ను పరిరక్షించుకునే దిశగా సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ నేతృత్వంలో పోరాడేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కోట్లాది నిధులు వెచ్చించి బీఆర్ఎస్ హయాంలో హాల్ నిర్మాణం చేపడితే, ఆ పనులు పూర్తికాక ముందే స్థలాన్ని ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టే ప్రయత్నం క్షమించరానిదన్నారు. దాదాపు 80 శాతం పనులు పూర్తయ్యాయన్నారు. దాదాపు కొంచెం నిధులు వెచ్చిస్తే హాల్ వినియోగంలోకి వస్తుందన్నారు. పేద మధ్యతరగతి వర్గాల వారికి ఉపయోగపడేలా నిర్మితమవుతున్న హాల్‌ను పేదలకే దక్కాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్సార్‌నగర్ నివాసితుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, కోశాధికారి పెంటయ్యగుప్తాతో పాటు నివాసితుల సంఘాలకు చెందిన వివేక్‌నాథ్, డేవిడ్ రాజు, రిచర్డ్, గౌతమ్‌రెడ్డి, శ్రీకాంత్‌యాదవ్, కిరణ్‌కుమార్, నాగేశ్వరరావుపాటోపాటు బీఆర్ఎస్ నాయకులు హనుమంతరావు, అశోక్ యాదవ్, కూతురు నరసింహ, కట్టా బలరాం తదితరులు పాల్గొన్నారు.

హౌసింగ్ సొసైటీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ నాన్ టీచింగ్ ఎంప్లాయీస్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలైంది. ఎన్నికల అధికారి లక్ష్మినారాయణ విడుదల చేశారు. బ్యాలెట్ విధానం ద్వారా నిర్వహించనున్న ఈ ఎన్నికల్లో మొత్తం తొమ్మిది మందిని ఎన్నుకోనున్నట్లు ఆయన తెలిపారు. ఈ నెల 18, 19 తేదీల్లో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4వరకు వర్సిటీలోని ఎలక్ట్రికల్ సెక్షన్ కార్యాలయంలో నామినేషన్లను స్వీకరించనున్నట్లు చెప్పారు. 19న నామినేషన్లను పరిశీలన, నామినేషన్ల ప్రకటన ఉంటుందన్నారు. ఉపసంహరణకు 20న అవకాశం కల్పించామని, అదేరోజు జాబితాను విడుదల చేస్తామని స్పష్టం చేశారు. ఈ నెల 29న ఓయూ మోడల్ హై స్కూల్లో ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. అనంతరం ఫలితాలను విడుదల చేస్తామని పేర్కొన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నివారించాలి

చిక్కడపల్లి, జూన్ 10: పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలను పెంచడం, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని వక్తలు పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని మంగళవారం బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో ఈ సంవత్సరం ప్రపంచ థీమ్ ప్లాస్టిక్ అంతం పై సెమినార్ నిర్వహించారు. ప్లాస్టిక్ కాలుష్యం గురించి అవగాహన పెంచడం, స్థిరమైన పద్ధతులను ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు డైరెక్టర్ డాక్టర్ విష్ణు ప్రియ తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ బి.అంజన్‌కుమార్, ప్రొఫెసర్ అప్పలయ్య మీసాల పాల్గొన్నారు.

తలసాని శంకర్‌యాదవ్ సేవలు మరువలేనివి

శంకర్‌యాదవ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న లక్ష్మర్ జిల్లా సాధన సమితి నాయకులు

సికింద్రాబాద్, జూన్ 10: మోండా మార్కెట్ కూరగాయల వర్తక సంఘం అధ్యక్షుడు తలసాని శంకర్‌యాదవ్ ప్రథమ వర్ధంతిలో పలువురు నాయకులు పాల్గొని నివాళులర్పించారు. మోండా మార్కెట్‌లోని ఆయన నివాసంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో లక్ష్మర్ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్‌కుమార్‌గౌడ్, సాధం బాలరాజ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

శుభ్రతకు సహకరించాలి

బన్సీలాల్‌పేట్, జూన్ 10: రోగులు, వారి సహాయకుల కోసం ఆధునీకరించిన నూతన టాయిలెట్ బ్లాక్‌ను గాంధీ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ రాజకుమారి ప్రారంభించారు. ప్రధాన భవనంలోని గ్రౌండ్ ఫ్లోర్, 8 అంతస్తులతో పాటు అన్ని వార్డుల్లో సుమారు 500పైగా పాత టాయిలెట్లను సమూలంగా మార్చివేసినట్లు ఆమె తెలిపారు. పారిశుధ్య సిబ్బంది 24 గంటలు పని చేస్తుంటారని, ప్రజలు కూడా బాధ్యతగా పరిసరాలను, మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచడానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దవాఖాన ఆర్ఎంఓలు డాక్టర్ యోగేందర్, డాక్టర్ నవీన్, టీజీఎంఎస్ఐడీసీ డిప్యూటీ ఈఈ అనిల్‌కుమార్, ఏఈ భీమన్న, ఇన్‌చార్జి జగదీష్‌ప్రసాద్ పాల్గొన్నారు.

గాంధీలో వైద్యుల స్వచ్ఛంద రక్త దానం

జనరల్ సర్జరీ విభాగంలో జరిగిన స్వచ్ఛంద రక్తదాన శిబిరంలో పాల్గొన్న వైద్యులు

బన్సీలాల్‌పేట్, జూన్ 10: గాంధీ దవాఖాన జనరల్ సర్జరీ విభాగం ఆధ్వర్యంలో స్వచ్ఛంద రక్త దాన శిబిరం నిర్వహించారు. జూన్ 9 నుంచి 15 వరకు నిర్వహిస్తున్న సర్జన్స్ వారోత్సవాల సందర్భంగా అసోసియేషన్ ఆఫ్ సర్జన్స్ ఆఫ్ ఇండియా, తెలంగాణ శాఖతో కలిసి శిబిరం ఏర్పాటు చేశామని జనరల్ సర్జరీ హెచ్ఓడీ ప్రొఫెసర్ డా.రాజారాం తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో రోగుల ప్రాణాలను కాపాడే రక్త దానం ఆవశ్యకతను ప్రతిఒక్కరు అవగాహన పెంచుకోవాలన్నారు. శిబిరంలో డా.సీహెచ్ సంతోష్‌బాబు, ప్రొ.డి.శ్రీనివాస్, డా.ఎం.శ్రవన్ కుమార్, డా.జీ.జగదీశ్వర్‌గౌడ్, డా.బీ.రాజు, ఆర్ఎంవోలు డా.రజని, డా.కళ్యాణ్ చక్రవర్తి, డా.నవీన్, డా.నజీమ్, డా.మీనాక్షి, డాక్టర్ యోగేందర్, పీజీ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

హుస్సేన్‌సాగర్‌లో దూకి వ్యక్తి ఆత్మహత్య

బేగంపేట్, జ